




కోడూరు తీరంలో పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు

మండలంలోని కొత్తకోడూరు సముద్రతీరం గురువారం పర్యాటకులతో పోటెత్తింది. ఎటువంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జంపాని కుమార్ తీరం వెంబడి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాములుగా ఆదివారాలు, పర్వ దినాలలో జిల్లా నలుమూలల నుంచి కో డూరు తీరానికి ప్రజలు తరలిరావడం సహజం. అయి తే రొట్టెల పండుగను పురస్కరిం చుకొని ప్రపంచ వ్యా ప్తంగా ప్రసిద్ధిగాంచిన నెల్లూరు బారాషహీద్ దర్గా వద్దకు దేశవిదేశాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చా రు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతమంతా జన సంద్రంగా మా రింది.



కోడూరులో తీరంలో పర్యాటకుల సందడి దృశ్యం

'స్వర్ణాల'లో జనసముద్రం..!

◆రెండో రోజు 2 లక్షల మంది రాక

◆మంత్రి 'ఆనం' సమీక్ష

◆నేడు సిఎం భక్తులతో వర్చువల్ మీటింగ్

◆రొట్టెల పండుగకు వర్షం దెబ్బ

◆చలిలో వణుకుతోన్న భక్తులు

స్వర్ణాల చెరువు రెండో రోజు జనసముద్రాన్ని తలిపించింది.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో బారాషాహీద్ దర్గా ప్రాంతం కిటకిటలాడింది. గురువారం సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్గాను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి, గురువారం వర్షం రావడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. భారీగా తరలిరావడం, వర్షాం దెబ్బతో చలికి అవస్థలు పడ్డారు. మరో మూడు రోజులు వర్షం ఉండడంతో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన నెలకుంది.



స్నానాలు చేస్తున్న యువకులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

బారాషాహీద్ దర్గా రెండో రోజులు భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు స్వర్ణాల చెరువులో స్నానాలు చేసి, రొట్టెలు మార్చుకున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. జిల్లా వాసులు పెద్దగా కనిపించకపోయినా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో దర్గా ప్రాంత రోడ్లు కిక్కిరిశాయి. దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా దృష్టి సారి స్తున్నారు. దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలగిస్తూ, పరిసరా లను పరిశుభ్రంగా ఉంచు తున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్ర మాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో అక్కడున్న టెంట్లు ఏమాత్రం సరిపోవడం లేదు. బయట రూమ్‌లు తీసుకొనే స్తోమత లేకపో వడంతో అక్కడే భక్తులు ఉంటున్నారు. వర్షం తో ఇబ్బం దులు తప్పడం లేదు. మరిన్ని టెంట్లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరు తున్నారు.



దర్గా ప్రాంగణంలో యాత్రికులు



స్వర్ణాల చెరువు తీరంలో యాత్రికులు

మంత్రి ఆనం సమీక్ష

రొట్టెల పండుగ ఏర్పాట్లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమీక్షించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు దర్గాకు వచ్చే భక్తులతో విజయవాడ నుంచి వర్చువల్‌గా పాల్గొననున్నారు. ఇందుకోసం 10 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. సమయం ఉంటే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నెల్లూరు రావాల్సి ఉంది. సమయం లేకపోవడంతో విఐపిలు ఎవ్వరూ రావడంలేదని తెలుస్తోంది. అధికారులు అంతా కొత్తవారు కావడంతో కొంత ఇబ్బందులు న్నాయి. సమీక్షలో కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్‌పి కృష్ణకాంత్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఉన్నారు.



రొట్టెలు మార్చుకుంటున్న యువతులు

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అక్రమాలపై

విచారణ కొనసాగిస్తాం..

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతకుమారిపై వచ్చిన ఆరో పణలపై విచారణ కొనసాగుతుందని, పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించుకొని తదుపరి చర్యల కోసం సిఎం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా దేవాదాయ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ శాఖకు చెందిన భూములను ఎంత మేరకు కబ్జాకు గురయ్యాయో అధికారులు విశ్లేషణ చేస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో నివేదికలన్నీ అందిన అనంతరం సిఎం అనుమతితో శాఖ పరమైన నిర్ణయాలు తీసుకోవడం, విచారణకు ఆదేశించడం వంటివి ఉంటాయన్నారు. దేవా దాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శాంతి కుమారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. ఆమెకు రాజకీయ సంబంధాలున్నాయన్నారు. ఆమె పనిచేసిన నాలుగు, ఐదు దేవస్థానాల్లో అవినీతి మార్గాలను అన్వేషించడం, అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ న్యాయవాది సుభాష్‌రెడ్డి, విజయసాయిరెడ్డికి నోట్లో నాలుక వంటి వ్యక్తి. విశాఖపట్నంలో విజయసాయిరెడ్డి చేసిన ప్రతి రెవెన్యూ దందాలో సుభాష్‌రెడ్డి, శాంతిల ప్రమేయం ఉందనేది తమ తెలిసిన సమాచారం అన్నారు. లోతుగా విచారణ చేయాల్సి ఉందన్నారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి, టిడిపి నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సిఎం దూరదృష్టితో సుపరిపాలన

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ప్రజలకు సుపరిపాలన అందిం చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో ఎన్నో మంచి నిర్ణయాలు తీసుకుం టున్నారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు, అక్రమాలపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. రాజధాని నిర్మాణం కోసం సేకరించిన అమరావతి భూములను బీడు భూములుగా మార్చి వేశారని విమర్శించారు. టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి, టిడిపి నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు : టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణించిపోయాయని, వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు వరుస దాడులకు పాల్పడుతూ ప్రాణాలను హరిం చివేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలో డైకస్ రోడ్డులోని తన క్యాంపు కార్యాల యంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. ప్రతి విషయంలో అబద్ధపు శ్వేతపత్రాలు విడుదల చేసే చంద్రబాబు రాష్ట్రంలో తన 40 రోజుల పాలనలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలు, టిడిపి నాయకులు చేస్తున్న దాడులు, హత్యలపై వాస్తవాలతో కూడిన శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నడి రోడ్డు మీద వైసిపికి చెందిన రషీద్ ను టిడిపి నాయకుడు జిలానీ దారుణంగా హతమార్చాడం హేయమన్నారు. టిడిపి నాయకుడు చేసిన దాడిని వ్యక్తిగత వివాదాల వల్లే హత్య జరిగిందని ఎస్.పి.చెప్పడం దారుణమన్నారు. రషీద్ హత్యకు జీలాని పాత్రదారుడే అయినా, సూత్రధారులను కూడా గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. మాజీ లోక్‌సభ రెడ్డెప్ప నివాసానికి లోక్‌సభ సభ్యుడు మిథున్‌రెడ్డి వెళ్లగా టిడిపి నాయకులు దాడులకు పాల్పడం ఎంత వరకు న్యాయమన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఇటువంటి దారుణాలు చోటు చేసుకుంటుంటే ఏమి చేస్తున్నారని, ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైసిపి నాయ కులు, కార్యకర్తలు ఎవ్వరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, అందరికి అండగా తాము నిలుస్తామన్నారు. ధైర్యంగా ఉండాలన్నారు. అరాచకాలు, దాడులు చేస్తున్న టిడిపి నాయకులపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : కౌలు రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.వి శిరీష రాణి పేర్కొన్నారు. గురువారం మం డలం వెంకన్న పాలెం గ్రామంలో క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు (సిసిఆర్‌సి) ప్రత్యేక కార్యక్ర మం జరిగింది. ఎంఇఒ మాట్లాడుతూ కౌలు రైతుల సం క్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కషి చేస్తోందని తెలిపారు. అందు కోసమే సిసిఆర్‌సి విధా నాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహా యకులు కావేరి, అనూ ష, ఝాన్సీ, విఆర్ఒలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

తోటపల్లిగూడూరు :ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడు కోవాలని మండల విద్యాశాఖాధికారి సన్నపురెడ్డి వేణు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆర్.వి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒలు వేణుగోపాల్ రెడ్డి, డి. జయ రామనాయుడు అధ్యక్షతన ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సహ కారంతో ఆర్‌వి కండ్రిక పాఠశాలకు 30 మామిడి, చెట్లు 10 నిమ్మ చెట్లు పంపిణీ చేశారు. ఎంఇఒ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం చేయ డం కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని ఈ కార్యక్రమం ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంఇఒ జయరామ నాయుడు మాట్లాడారు. పాఠశాలకు మొ క్కలు పంపిణీ చేసిన ఎంఇఒ లు వే ణుగోపాల్ రెడ్డి, జయరామా నాయు డులకు ఉపా ధ్యాయులు ఎన్.నారా యణ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హాస్టల్లో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని ఇస్క పాలెంలోని బిసి వె ల్ఫేర్ హాస్టల్‌ను ఎంపిడిఒ బాలాజీ గురువారం. ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగా హన కల్పించాలని, నాణ్యతతో కూడిన భోజన వసతి ఏర్పాటు చేయాలని, హాస్టల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని, హాస్టల్ వెల్ఫేర్ అధి కారి మూర్తికి సూచిం చారు. 48 మంది విద్యార్థులకు గా ను 28 విద్యార్థులు హాజరైనట్లు గమనించారు. బుధ వారం సెలవు కారణంగా విద్యార్థులు స్వగహాలకు వెళ్లి నట్లు హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎంపిడిఒ బాలాజీ కి తెలి తెలిపారు. అనంతరం వరిగొండ పిహెచ్సిని ఎంపీడీఓ బాలాజీ సందర్శించారు. వరిగొండలో నిర్వహిస్తున్న పారిశుద్ధ నిర్వహణ కార్యక్రమాలను ఎంపిడిఒ బాలాజీ పరిశీలించారు.

గంధమహోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి-నెల్లూరు : బారాషాహిద్ దర్గా వద్ద గురువారం గంధమహోత్సవం జరుగనున్న నేపథ్యంలో యాత్రికులకు తొక్కిసలాటలకు గురైయ్యే అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో యాత్రికులకు రక్షణ కల్పించేందుకు పకడ్బందీ ఏర్పాటు చేశామని ఎస్‌పి జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన సహచర సిబ్బందితో దర్గా ఆవరణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ యాత్రికుల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తారన్నారు. డ్రోన్ కెమెరాల నిఘా నీడలో బారాషాహీద్ దర్గా ప్రాంగణం, పరిసరాలు ఉన్నాయన్నారు. బారాషాహీద్ దర్గా స్వర్ణాల చెరువులో అట్టహాసంగా, పూర్తి స్థాయి నిఘా నీడలో ప్రశాం తంగా రెండవ రోజు కొనసాగుతుందన్నారు. దేవాదాయ శాఖా మంత్రివర్యులు ఆనం రామ నారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్‌తో కలిసి గంధమహోత్సవ విధివిధానాలు పరిశీలించారు. అడిషనల్ యస్. పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య , నగర డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి, కావలి డిఎస్‌పి వెంకటరమణ, సంతపేట సిఐ సుబ్బరాజు ఉన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలి

ప్రజాశక్తి - కందుకూరు : గుడ్లూరు మండలంలోని దప్పళంపాడు – రాళ్లపాడు మధ్యన ఉన్న మన్నేరు నదీ పరీవాహక ప్రాంతంలోని ఇసుకను అక్రమంగా తరలించేందుకు కొంతమంది బడా నేతలు చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని దప్పళంపాడు గ్రామ మాజీ సర్పంచ్ వలేటి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ జి విద్యాధరి ని కలిసి వలేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్తులు పలువురు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దప్పళంపాడు – రాళ్లపాడు మధ్యనున్న మన్నేరు నదిలో అర కిలోమీటర్ మేర వెడల్పు, కిలోమీటర్ పొడవు పరిమాణంలో 10 అడుగులకు పైగా ఉన్న ఇసుక దిబ్బలను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకునేందుకు కొంతమంది బడాబాబులు దప్పళంపాడు నుంచి రాళ్లపాడు గ్రామానికి అనుసంధానంగా కిలోమీటర్ మేర రహదారిని నిర్మించినట్లు తెలిపారు.. మన్నేరులో అక్రమ ఇసుక తరలింపు ద్వారా అక్కడ భూగర్భ జల మట్టం తగ్గిపోయి భవిష్యత్తులో ఈ చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్రంగా నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి అక్రమ ఇసుక తరలింపుపై నిఘా ఏర్పాటు చేసి వెంటనే నిలుపుదల చేయాలని వలేటి వెంకటేశ్వర్లు సబ్ కలెక్టర్ విద్యాధరిని కోరారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సర్టిఫికెట్ల కోసం అవస్థలు

ప్రజాశక్తి -వెంకటాచలం : కుల ధ్రువీకరణ పత్రం, రాబడి ధవీకరణ పత్రాలు పొందాలంటే వి.ఆర్.ఓ, ఆర్.ఐ, ఎంఆర్ఒ సంతకాలు తప్పనిసరి. వెంకటా చలం తహశీల్దార్ కార్యాల యంలో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది వారి సంతకం కావాలంటే ముడుపులు అడుగుతున్నారని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది కుల, రాబడి ధ్రువీకరణ పత్రాల కోసం వెంకటాచలం తహసిల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా రోజులు తరగాబడి తిరుగుతున్న, గంటలు సమయం వెచ్చించి చెట్ల కింద కూర్చుంటున్న ఏ ఒక్కరు వారి సమస్యలు పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి విద్యార్థుల సమస్య లను, వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విచారణ జరిపించాలి : సిపిఎం

కుల, రాబడి ధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు, ప్రజలకు చాలా ముఖ్యమైనవి. కొందరు రెవెన్యూ సిబ్బంది, అధికారులు తహసీల్దార్ కార్యాలయానికి ధ్రువీకరణ పత్రాల కోసం విచ్చన విద్యార్థుల పై దురుసుగా ప్రవర్తిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఓడూరు వెంకట కష్ణయ్య పేర్కొన్నారు. ముడుపులు అడుగు తున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

నెల్లూరు : మండల కేంద్రంలో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కమిటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. గురువారం ముత్తుకూరు మండల సిపిఎం కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడుతూ తమ ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఉన్నాయని, వాటిల్లో వల్ల కార్మికులు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారన్నారు.నిరంతరం మండల కేంద్రానికి వైద్యం చేయించు కునేందుకు రోగులు వస్తూ ఉంటారని, వీటిన్నంటిని ఆలోచన చేసి అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయడం వల్ల వారందరికీ తక్కువ ఖర్చుతో భోజన వసతి కల్పించినట్లు అవుతుందన్నారు. రోడ్ల వెంబడి తోపుడు బండ్ల వ్యాపారస్తులు, యాచకులు బిక్షాటన చేస్తూ నిరంతరం బస్టాండ్ సెంటర్లలో రద్దీగా తిరుగుతూ ఉంటారని, వీరందరిని దష్టిలో ఉంచుకొని ముత్తుకూరు మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్ ను మొదటి విడతలోనే ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ నెల్లూరు సుధాకర్ బ్రహ్మ దేవి మోహన్‌రావు ఎస్ కే సలాం బెల్లంకొండ సురేష్ నక్క వెంకటేశ్వర్లు ఉన్నారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణం 14 వార్డు శ్రీరామనగర్‌కు చెందిన పర్రే వెంకటకృష్ణ కూలి పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. గత నెల రోజుల కిందట ఉదయాన్నే పనులకు వెళ్తున్న సందర్భంలో ఎదురుగా బైక్ రావ డంతో బైక్‌ను తప్పించే సందర్భంలో కిందపడి తలకు బలమైన గాయమైంది. గత నెల రోజుల నుంచి హైదరాబాదులో చికిత్సపొందుతున్న పర్రె వెంకటకృష్ణకు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఎస్ఆర్ చికెన్ సెంటర్ అధినేత సురేష్ రెడ్డి రూ 20, 000, సూర్య బార్ నేత పిడికిటి వెంకటేశ్వర్లు రూ20000, కాలనీవాసి తల తోటి మస్తాన్ రూ 20000, అంబటి కొండలరావు రూ20000, విజ్ఞాన్ విహార్ స్కూల్ కరస్పాండెంట్ హరిబాబు రూ5000, కోటపూర్ శీను, మెండం అనిల్, మరికొంత మంది వెంకటకష్ణ చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు. వీరికి వెంకటకష్ణ కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

జిల్లా రిసోర్స్ పర్సన్‌గా శ్రీధర్

తోటపల్లిగూడూరు : జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో జిల్లా రిసోర్స్ పర్స న్ గా (అదనపు బాధ్యతలు) మండలంలోని వరిగొండ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ నియమితు లయ్యారు. ఈ మేరకు ముఖ్యకార్య నిర్వహణ అధికారి జిల్లా ప్రజా పరిషత్ అండ్ డిపిఆర్‌సి ప్రిన్సిపాల్ గురు వారం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ బాలాజీ తెలిపారు. శ్రీధర్ స్థానంలో పోట్లపూడి పంచాయతీ కార్యదర్శి జి. వెంకటేశ్వర్లును పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి గా నియమించినట్లు ఎంపిడిఒ చెప్పారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు షైన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఊరి బయట శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు షైన్ ఫౌండేషన్ వారు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీం మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలం నుంచి షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివారు ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఆహారం, బియ్యం, కూరగాయలు, పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. షైన్ ఫౌండేషన్ ప్రతినిధులు నయీమ్ భాష , వెంకటేశ్వర్లు, కరీముల్లా, డాక్టర్ రాయ్, పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా వ్యాప్తంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సుల నిర్వహించేందుకు చర్యలు తీసు కుంటున్నామని ఎస్ఈ వి.విజయన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విద్యుత్తు భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : జన సైనికులకు, వీర మహిళలకు భరోసా కల్పించడమే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ధ్యేయమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు అన్నారు. గురువారం నగరంలోని ఏసీ నగర్ లో ఉన్న పార్టీ నగర కార్యాల యంలో ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సుజయ్ బాబు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వంతో పాటు ప్రమాద, జీవిత బీమా పొందవచ్చు అన్నారు. కొత్తగా నమోదుతో పాటు రెన్యువల్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. నాలుగవ ఏడాది క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. జనసేన నగర రూరల్ డివిజన్ ఇంచార్జులు క్లస్టర్ ఇంచార్జులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల బోధనను మరింత మెరుగుపరచడానికి ఉపాధ్యాయులకు సహకారం అందించే ' టీచ్ టూల్ ' శిక్షణా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు కందుకూరు డిప్యూటీ డిఇఒ ఎంవివి ప్రసాదరావు పేర్కొన్నారు. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజులు పాటు జరిగే టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంఇఒ మల్లికార్జున, ప్రధా నోపాధ్యాయులు ఎం నరసింహమూర్తి, శ్రీనివాసరావు మాస్టర్ ట్రైనీలు అబ్జర్వర్లు ఉన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మండలంలోని పోకూరులోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసా యాధికారి ఎం. హేమంత్ భరత్ కుమార్ ఆధ్వర్యంలో పంట సాగు చేసే కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్సి – క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్) పై రైతులకు అవగాహన సదస్సు జరిగినది, కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి అనసూయ పాల్గొన్నారు, గ్రామ వ్యవసాయ మరియు ఉద్యానవన సహాయకులు వై. సుష్మ, ఖాదర్ బాషా గ్రామ రెవెన్యూ అధికారి హరికష్ణ ఉన్నారు.



హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-కందుకూరు : హైకోర్టు ఆదేశాలు మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అనే అంశముపై కందుకూరు కోర్టు ఆవరణం నుంచి పోలీస్ స్టేషన్ వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతి థులుగా ఎం.ఎల్.ఎస్. సి.చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి పూర్ణిమా దేవి పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా తప్పించు కోవాల న్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రమేష్ బాబు, న్యాయవాదులు,రూరల్ సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ సిబ్బంది,న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్జి శోభారాణి

బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కందుకూరు : జిల్లా ఉప రవాణా కమిషనర్ బి చందర్ ఉత్తర్వుల మేరకు కందుకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్ పరిధిలో ఉన్న కందుకూరు, గుడ్లూరు, లింగస ముద్రం, వలేటివారిపాలెం, ఉలవపాడు ఐదు మండలాల్లో ట్యాక్స్ బకాయిలు ఉన్నటువంటి గూడ్స్ వాహనాలు, 562, ట్రాక్టర్, ట్రైలర్ పబ్లిక్ వాహనములు 602 , మాక్సి క్యాబ్ లు 56 టాక్స్ బకాయిలు ఉన్నాయని కందుకూరు మోటారు వాహనముల తనిఖీ అధికారి ఎమ్‌డి రఫీ తెలిపారు. ట్రాన్స్‌పోర్టు వాహనదారులు ప్రతి ఒక్కరు ట్యాక్స్ బకాయిలను చెల్లించాలని కోరారు.



వాహన బకాయిలను చెక్ చేస్తున్న ఎంవిఐ ఎమ్‌డి రఫీ

సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మండల టిడిపి సీనియర్ నాయకులు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు నాదెళ్ల వెంకట సుబ్బారావు దశదినకర్మ కందుకూరు మండలం కోవూరులో గురువారం జరిగింది. ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరై సుబ్బారావు చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నాదెళ్ల వెంకట సుబ్బారావు తెలుగుదేశం పార్టీ కోసం నిబద్ధతతో సేవ చేశారని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అనేక పదవులు చేపట్టి ప్రజల తరపున పోరాడారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కొనియాడారు. నివాళి అర్పించినవారిలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం , కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందు కూరు పట్టణ టిడిపి మాజీ అద్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు,మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు ఉన్నారు.



సుబ్బారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇంటూరి

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి -వెంకటాచలం : నిడిగుంటపాలెంలో గురువారం నెల్లూరుకు చెందిన నారాయణ దంత వైద్యశాల సహకారంతో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి రావూరి రాధా కృష్ణమనాయుడు, టీడీపీ మండల సీనియర్ నాయకులు రావూరి పద్మనాభ నాయుడు, బీ చైతన్య రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు కుంచి శ్రీనివాసులు యాదవ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నారాయణ దంత వైద్యశాల దంత వైద్య నిపుణులు విచ్చేసి ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికీ మందులు పంపిణీ చేశారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి : సిపిఐ

నెల్లూరు : కటారి పాలెం లోని ఎస్సి కమ్యూనిటీ హాల్ పూర్తి చేయాలంటూ సిపిఐ నాయకులు నిరసన చేపట్టారు. గురువారం చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు షానవాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, షబ్బీర్, రియాజ్, వెంకటేశ్వర్లు, సర్దార్, షాకీర్, బాబయ్య, గౌస్, సురేంద్ర, రాజేష్, వెంకటేశ్వర్లు, ఆనంద్, మళ్ళీ,రవి పాల్గొన్నారు

కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే

నెల్లూరు : జి ఆగష్టు 2వ తేది వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం, అవగాహన విజయవంతం చేసే క్రమంలో ప్రతి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వాలంటీర్ల సహాయంతో ఇంటింటిని సందర్శించాలని డిఎల్ఏటిఒ డాక్టరు ఖాదర్‌వలి అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎస్‌సిడిసి ప్రారంభోత్సవానికి ఆయన హాజరైయ్యారు.

శిక్షణ తరగతులు పరిశీలన

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని ఎపి గురుకుల విద్యాలయం – బాలికల ప్రాంగణంలో ఆత్మకూరు డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సిఆర్‌పిలకు "టీచ్ టూల్" 9 రోజుల శిక్షణా కార్యక్రమాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.గోపాల్ ప్రారంభించారు. ఈ శిక్షణ ద్వారా టీచర్ బోధన సరళిలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. జరుగుతున్న శిక్షణా తరగతులను రాష్ట్ర పరిశీలకులు కె.శారదకుమారి సందర్శించి మాట్లాడారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్న పద్ధతులను, బోధనలో ఉన్న లోపాలను మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎఎంఒ వై.శాంతకుమారి, శిక్షణా తరగతుల ఇన్‌ఛార్జ్, ఎంఇఒలు ఎం.జ్యోతి, కె.చలపతి, మాస్టర్ ట్రైనీలు ఎ.సురేష్, టి.నాగేశ్వరరావు, పి.కేశవనారాయణ, సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగదు అందజేత

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని మంచాల పల్లి గ్రామంలోని జంగాల కాలనీ యూత్ సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం కోసం కృషి చేసిన యూత్‌కు గ్రామ నాయకులు నీలం అంజయ్య రూ.5వేల నగదు క్రికెట్ కిట్టు కోసం అందజేశారు. యూత్ సభ్యులు నీలం అంజయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలు అందజేత

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ఆమెనిచిరువెల్ల సచివాలయంలో గురువారం టిడిపి నాయకులు గాలిబోయిన సుబ్బరాయుడు, రమణారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఫొటోలను మండల పంచాయతీ విస్తరణ అధికారి రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంషుద్దీన్, మస్తాన్, రాజు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సంగం : సంగంలో అధికారులు స్టాప్ డయేరియా నివారణ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కొత్తూరు ప్రాంతంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది స్టాప్ డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి పరిశుభ్రతపై వివరించారు. డాక్టర్ అశోక్‌కుమార్ గురుకుల పాఠశాలలో వాటర్ ట్యాంక్‌లు పరిశీలించి విద్యార్థులకు స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని విరువూరుకు చెందిన మాలేం ప్రసాద్ రెడ్డి(40) ఇంటిలోనే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన మస్తాన్‌బీ దంపతులకు 12యేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. అప్పటి నుంచి బతుకు దెరువు నిమిత్తం నెల్లూరులోని బాలాజీ నగర్‌లో నివాసం ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో బాలాజీ నగరంలోని ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య, ఉరి వేసుకొని ఉండడం చూసి భయందోళనకు గురైంది. వెంటనే విరువూరు గ్రామంలోని బంధువులకు, కుటుంబ సభ్యులకు తెలియజేసి బంధువుల సహకారంతో మృతదేహాన్ని స్వగ్రామం విరువూరుకు తీసుకొని వచ్చారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియలేదు. పోలీస్‌లకు ఎటువంటి పిర్యాదు అందలేదు.

శాంపిల్ డ్రగ్స్ కేసులో నిందితుడికి జైలుశిక్ష

ప్రజాశక్తి కోవూరు: అక్రమంగా సాంపిల్ డ్రగ్స్‌ను నిల్వ ఉంచారన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు జెట్టి సునీల్‌కుమార్ రెడ్డికి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ జె.కాత్యాయని నిందుతుడికి మూడేళ్ల జైలు శిక్ష, లక్షా ఇరవై వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కోవూరు పిఎస్‌ఆర్ కాలనీలో ఓ నివాసంలో ఎటువంటి అనుమతులు లేకుండా సాంపిల్ డ్రగ్స్ నిల్వ ఉన్నాయన్న సమాచారంతో కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి 2012లో దాడి చేశారు. ఆ సమయంలో నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేశారు.

ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-కలిగిరి : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కలిగిరి ప్రాంత ప్రజల ఆరాధ్య దైవతగా పూజలు అందుకుంటున్న శ్రీ కలిగిరమ్మ తిరుణాల సందర్భంగా గురువారం ఉదయగిరి మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతి కుమారి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు పడి రైతులందరూ పాడి పంటలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం ఆలయాభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.10వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. టిడిపి మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఆలయ ధర్మకర్తలు, నాయకులు తదితరులున్నారు.

జనసేన సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-కావలి : జనసేన పార్టీ సభ్యత్వాన్ని గురువారం నుంచి ప్రారంభించామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకోవడం వల్ల ప్రమాదవశాత్తు జరిగే ఇబ్బందులను ఐదు లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదంలో దెబ్బలు తగిలినట్లయితే రూ.50 వేల వరకు బీమా క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. సభ్యత్వ నమోదుకు కావలసినవి ఆధార్ కార్డు, ఓటర్ ఐడి/ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో రూ.500 కావాలని తెలిపారు. 28వ తేదీ వరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నక్క సాయిరాం ప్రసాద్ షేక్ అఫ్జల్ బాషాలకు సభ్యత్వం ఇప్పించారు. సాయి రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కావలి నియోజకవర్గ అధ్యక్షులు అలా శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుంటుపల్లి కృష్ణయ్య, సీనియర్ నాయకులు తోకల వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షులు గడ్డె నాగార్జున, గాదంశెట్టి రవి, లక్ష్మి కవిత, పట్టణ ప్రధాన కార్యదర్శి నయీమ్, కామిశెట్టి మురళి, నక్క సాయిరాం ప్రసాద్, ప్రవీణ్, రామ్, శ్రీహరి నాని, కొండయ్య, 1వ వార్డు నాయకులు సిరాజ్ శ్రీనివాసులు, పులి రాజు, కోరా జాలయ్య, 40వ వార్డు నాయకులు మధు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త పిఒసి కొట్టె వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మండల అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 50 జనసేన సభ్యత్వాలు నమోదు చేశారు. గురువారం కలిగిరి పట్టణంలోని మహాలక్ష్మి గుడి వీధిలో ఇంటింటి తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. జనసేన సీనియర్ నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్య, రవీంద్ర, కటుకం శ్రీనివాసులు, అరిమల్ల మల్లికార్జున, సంతోష్, జనసేన వీర మహిళ జిల్లెల్ల నాగలక్ష్మి నందిపోగు రాజేశ్‌కుమార్, బండారు చరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసైనికుల పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి-కావలి: తిరుమల పాదయాత్రకు వెళుతూ కావలి జనసేన పార్టీ ఆఫీసుకు విచ్చేసిన సత్తెనపల్లి జనసేన నాయకులకు గురువారం కావలిలో జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆళహరి సుధాకర్ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నిలబెట్టిన 21మంది ఎంఎల్‌ఎలందరూ, ఉమ్మడి అభ్యర్థులు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కొండకు నడిచివస్తామని మొక్కుకున్నారన్నారు. మొక్కుకున్న వారు సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండల అధ్యక్షుడు తోట నరసయ్య ఆధ్వర్యంలో తిరుమల వెంకటేశ్వర స్వామి వద్దకు 13న దేవరపాడు నేతి వెంకన్నస్వామిగుడి పూజ చేసి పాదయాత్ర మొదలు పెట్టిన 10మంది నాయకులు బుధవారం రాత్రి జనసేన ఆఫీసుకు చేరుకున్నారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి అనంతసాగరం : మండలంలోని ఆమెనిచిరువెల్ల, మేకవారిపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత, వెంగంపల్లి ఉన్నత పాఠశాలలను గురువారం ఎంఇఒ-2 కావలిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం ఆమెని చిరువెల్ల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మరోసారి రెచ్చిపోయిన దొంగలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పలు గ్రామాల్లో దొంగలు రెచ్చిపోయారు. బుధవారం రాత్రి పొంగూరు కండ్రిక గ్రామానికి చెందిన మేకల శేషయ్య ఇంట్లో రూ.65వేల నగదు, కేజీ వెండి దొంగలు ఎత్తుకెళ్లారు. బుధవారం, ఉమ్మాయిపల్లి గ్రామాలకు చెందిన గేదెల గత కొన్ని రోజులుగా కనిపించక, గేదెల యజమానులు ఆందోళన వెతుకుతున్నారు. రెండు గ్రామాలకు చెందిన గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి 12గంటలు సమయంలో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. గేదెలను అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిలో ఇద్దరిని పట్టుకొగా మరొకరు పరారయ్యారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఇద్దరు నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వైసిపి హయాంలో సహజవనరుల దోపిడీ

ప్రజాశక్తి-కావలి

గత వైసిపి పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోయిందని ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఈ ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు ఎపి ప్రభుత్వం శ్వేత పత్రాలను విడుదల చేయడం జరుగుతుందన్నారు. వైసిపి పాలకులు ఏవిధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాల ద్వారా బయట పెడుతున్నామన్నారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటి విలువ రూ.35,576 కోట్లు పైనే అని తెలిపారు. ఇళ్ల పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750కోట్లు దోచుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జిఒ 512ను రద్దు చేయడం జరిగిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసిపి నేతలు భూదోపిడీకి పాల్పడ్డారన్నారు. ప్రయివేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేదల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారన్నారు. ఇంతటి ప్రమాదకరమైన చట్టాన్ని దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం అమలు చేయలేదన్నారు. కానీ నల్ల చట్టంలోని లొసుగులను గ్రహించిన గత



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

ప్రభుత్వం జిఒ 512ను జారీ చేసి అక్రమాలను సక్రమంగా మార్చే ఆయుధంగా నల్లచట్టాన్ని వాడుకున్నారన్నారు. సొంతవారి కోసం రికార్డులు సృష్టించే ఎత్తుగడను పన్నారన్నారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసిపి నేతలే నిర్ణయించేవారని, అందుకు ముందే స్థలం కొని తిరిగి ప్రభుత్వానికి అధిక రేటుకు అమ్మిశారని, అనేక రెట్లు పరిహారం కొట్టేశారన్నారు. తక్కువ ధరకు రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి ఇళ్ల స్థలాల కోసం అమ్మిన వైసిపి నేతల భాగోతాల గురించి సాక్ష్యాధారాలతో సహా శ్వేత పత్రంలో పొందుపరచడం జరిగిందన్నారు. ఇళ్ల పట్టాల్లో వైసిపి నేతలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, వీరి దగ్గర నుంచి ప్రతీ రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమకడుతామన్నారు. వైసిపి జిల్లా కార్యాలయాల కోసం రెండేసి ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజుకు ఇచ్చుకున్నారన్నారు. మొత్తం రూ.300 కోట్ల విలువైన భూమిని కేటాయించుకున్నారన్నారు. కొండలను సైతం వైసిపి ప్రభుత్వం అనకొండల్లా మింగేసి గుండులు కొట్టేశారన్నారు. ఇష్టానుసరంగా నిబంధనలకు విరుద్ధంగా వైసిపి ఎంఎల్‌ఎలే అక్రమంగా భూగర్భ వనరులను తొవ్వేశారన్నారు. వైసిపి నేతలు ఇసుకాసురల అవతా రాలెత్తి ఇసుకను మింగేశారన్నారు. వందలాది టిప్పర్ల ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి నూతన ఇసుక విధానంపేరుతో భవన నిర్మాణ రంగాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం కుప్ప కూల్చిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను సైతం వైసిపి నాయకులు వదిలి పెట్టలేదన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను మింగేశారన్నారు. జేపి వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800కోట్లు మినహాయించారని, మింగేసిన ఇసుకతో దాదాపు పది లక్షలకు పైగా ఇళ్లు కట్టకోవచ్చన్నారు. వైసిపి చేసిన అన్ని అక్రమాలను వెల్లడిస్తామన్నారు.

అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు

ప్రజాశక్తి-ఉదయగిరి

పెద్ద చెరువు నీటి పారుదల శాఖకు చెందిన చెరువులో అక్రమంగా మట్టి తవ్వితే చట్టపరమైన చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డిఇ చంద్రమౌళి హెచ్చరించారు. గురువారం స్థానిక జలవనుల శాఖ కార్యాలయంలో ట్రాక్టర్, జెసిబి ఓనర్‌లతో ఆయన సమావేశం నిర్వహించి అక్రమ మట్టి తరలింపుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అనుమతులు తీసుకొని అవసరాన్ని బట్టి చెరువుల్లో మట్టి తీయాలని ఇష్టానుసారం ప్రకారం మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మరమ్మ తులు అవసరమైన చెరువులను గుర్తించి రాబోయే వర్షాలలోపు మరమ్మతులు చేస్తామన్నారు. గండిపాలెంలో ఉన్న పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం కుడి, ఎడమ కాలువల గేట్లు మరమ్మతులకు గురై ఉన్నాయని, వాటి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించామని వెంటనే మరమ్మతుల కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. అలాగే సీతారామపురం మండలం పెద్దచెరువు, మర్రిఊట్ల రిజర్వాయర్



తూము గేట్ల మరమ్మతులు చేస్తామన్నారు. అలాగే గండిపాలెం మార్గం వైపు శిథిలావస్థలో ఉన్న అతిథి భవనంకు నూతన అతిథి గృహ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేసి అంచనాలు రూపొందించామని తెలిపారు. త్వరలోనే అవసరమైన చెరువులకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఎక్కడైనా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు తరలింపు జరుగుతున్నట్లు తన దృష్టికి వస్తే తక్షణ చర్యలు చేపడతామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

ముగిసిన పీర్ల మహోత్సవాలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల గ్రామంలో వెలిసిన హజరత్ సాహెబ్ బాదుల్లా మస్తాన్‌వలీ పీర్ల మహోత్సవాల 15వ తేదీ నుంచి ప్రారంభమై గురువారం ముగిశాయని కార్య నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ రహమాన్, షేక్.మస్తాన్ వలీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో 50మంది పైగా భక్తులు నిప్పులపై నడిచారన్నారు. పూజారి సయ్యద్ మహమ్మద్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్లను పెన్నా నదికి సాగనంపారని తెలిపారు. డీజే కార్యక్రమంలో ముస్లిం, హిందూ సోదరులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారన్నారు. ముస్లిం పెద్దలు రసూల్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దర్గాలో చెంచలబాబు ప్రార్థనలు

ప్రజాశక్తి-ఉదయగిరి



రొట్టె అందుకుంటున్న చెంచలబాబు

రొట్టెల పండగ సందర్భంగా బారా సాహెబ్ దర్గాలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ మొక్కును తీర్చుకున్నారు. గురువారం నెల్లూరులోని బారా సాహెబ్ దర్గాలో గత సంవత్సరం జరిగిన రొట్టెల పండగ సందర్భంగా 2024 ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని రొట్టెల పండగ సందర్భంగా బారా సాహెబ్ దర్గాలో రొట్టెను పట్టుకున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం అల్లా ఆశీస్సులతో చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంపై రొట్టెను అందజేశామన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ రాష్ట్రాన్ని అన్నిరంగాలలో ముందుకు సాగాలని, ఆలయ మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు ప్రార్థించారు. ముందుగా మసీదు మతపెద్దలు దర్గా కమిటీ సభ్యులు చెంచలబాబు యాదవ్‌ను ఆప్యాయంగా పలకరించి పూలమాలలు శాలవాలతో సన్మానించారు. కార్యక్రమంలో రవీంద్రబాబు సీతారాంపురం మండల కన్వీనర్ ప్రభాకర్ రాజు, దర్గా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

గుడికి దారి చూపండి సారూ..

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పడుగుపాడు గ్రామ దేవత చింతలమ్మ అమ్మవారి గుడి ఏర్పడి వందల యేళ్లు గడిచిందని, ఆటువంటి ఆలయానికి ఊరులోని ప్రజలకు దారి లేకుండా జాతీయ రహదారి నిర్వాహుకులు గేట్లు వేశారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం అక్కడ పనులను ఆపివేయడంతో ఆందోళన విరమించారు. పడుగుపాడు గ్రామం ఏర్పడి శతాబ్దాలు గడిచాయని అప్పుడు వున్న దారినే ఇప్పుడు కూడా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. మహాకవి మొల్ల కాలంలో గ్రామదేవత ఆలయాన్ని నిర్మించారని పురాణం చెబుతుంది. అటువంటి చరిత్ర కలిగిన ఆలయానికి దారిలేక పోతే అమ్మవారికి పూజలు ఎలా చేయాలో రోడ్డు పనులు చేస్తున్న వారే చెప్పాలని గ్రామస్తులు అడుగుతున్నారు. ఈ విషయంలో ఎంఎల్‌ఎ ప్రత్యేక చొరవ తీసుకొని అమ్మవారి ఆలయానికి దారి ఏర్పాటు చేసే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా గ్రామం మనుగడ కోల్పోతుందన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరమ్మ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాయపాలెం సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ఉదయం సాయంత్రం రెండు పూటలా 100శాతం హాజరు ఉండాలన్నారు. ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే పలురికార్డులను, రిజిష్టర్లను అమె పరిశీలించి పలు సూచనలు, సలహాలు సిబ్బందికి తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, స్కూల్ మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ

ప్రజాశక్తి-అనంతసాగరం



పరిశీలిస్తున్న అధికారులు

అనంతసాగరం చెరువు దిగువు పంట పొలాలు సాగు చేసేందుకు రైతులకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత సుబ్బరాజు, స్థానిక నాయకులు చల్లా శివారెడ్డి, కేత శ్రీనివాసులు రెడ్డిలు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే మంత్రి స్పందించి రైతులకు ఇబ్బంది కలగకుండా తూముల షట్టర్లు మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు మరమ్మతులకు గురైన తూము షట్టర్లను పరిశీలించి జెఇ ఖాదర్‌తో కొలతలు తీయించారు. షట్టర్ల ప్రాంతంలో తొట్టిని ఏర్పాటు చేయాలని జెఇకి సూచించారు. తూముల మరమ్మతులకు సిద్ధం చేసినట్లు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-బిట్రగుంట



మండలంలోని సిఆర్‌పాలెం పంచాయతీ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న పంట సాగుదారుని హక్కు పత్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు విజయలక్ష్మి మాట్లాడుతూ బోగోలు మండలంలో సాగు చేస్తున్న రైతులు వారి భూమ హక్కు పత్రాలను సంబంధిత రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులకు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ సిఆర్‌పాలెం అసిస్టెంట్ అసిస్టెంట్ దీప్తి, సర్పంచ్, ఉపసర్పంచ్ నాయుడు వెంక రెడ్డి, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-మర్రిపాడు



స్థానిక తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా యని జనసేన మండల అధ్యక్షురాలు ఓరుగంటి ప్రమీల మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత గురువారం అక్రమ కట్టడాలను పరిశీలించారు. గతంలో తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని పట్టాదారులు, ఆర్‌డిఒకు వివరించారు. విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలలో ఇంటి నిర్మాణాలు చేపడితే విచారణ జరిపి తొలగిస్తామన్నారు. ఆమెవెంట తహశీల్దార్ సీతారత్నం, ఆర్‌ఐ సురేంద్ర, విఆర్‌ఒ వెంకటేష్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రి డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి-కావలి : కావలి ఏరియా వైద్యశాల కమిటీ మెంబర్లను నియమించినట్లు ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. కమిటీ మెంబర్లుగా చవల రామకృష్ణ, పొబ్బా సాయి విఠల్, ఆత్మకూరి నాగలక్ష్మిని నియమించినట్లు ఎంఎల్‌ఎ తెలిపారు.

షేక్.మునీర్ జాన్ ఎన్నిక

ప్రజాశక్తి-కావలి : విజయవాడలోని గొల్లపూడి వద్ద ఆల్ మైనారిటీ సెంట్రల్ అండ్ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎపి మైనారిటీస్ సెంట్రల్ అండ్ స్టేట్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్.మునీర్‌జాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మునీర్ జాన్ మైనారిటీ సెంట్రల్ అండ్ స్టేట్ ఎంప్లాయిస్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలియజేశారు.

21న ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో 21న ఆదివారం జరిగే గురు పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు కాకడ హారతి తదుపరి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ వారు తెలియజేశారు. పట్టణ ప్రజలు పాల్గొని గురుపౌర్ణమి పండుగను విజయవంతం చేయాలని తెలిపారు.

హెల్మెట్ల వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి జె.అంజయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడుక పోవడం వల్ల కలుగు మరణాలను నియంత్రించేందుకే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో లాయర్లు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు స్థానికులు పాల్గొన్నారు.

పజాశక్తి-కావలి : ప్రతి ద్విచక్ర వాహన దారులందరూ తప్పని సరిగా తలకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని నినాదాలు చేస్తూ, కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ (లోక్ అదాలత్) ఆధ్వర్యంలో గురువారం కావలి కోర్టు భవనాల ఆవరణం నుండి ఏరియా ఆసుపత్రి వరకు న్యాయమూర్తులు, న్యాయ వాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టుకు వచ్చిన కక్షిదారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పి.పరుసురాం, న్యాయవాదు సంఘ అధ్యక్షుడు కె.సురేంద్రరెడ్డి, కార్యదర్శి ఎం.జయప్రకాశ్, లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయి ప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండా రెడ్డి, న్యాయ వాదుల గుమాస్తాల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సెక్రెటరీ కొండయ్య సీనియర్, జూనియర్ గుమాస్తాలు, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని హెల్మెట్ జీవితానికి భరోసా తప్ప భారం కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి.రాకేష్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో కోర్టుల సిబ్బంది, న్యాయవాదులు కళాశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్ ధారణ తప్పనిసరి అని నినాదాలు చేస్తూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాద సేవాసంఘం సభ్యులు న్యాయవాదులు ఎల్‌వి రమణయ్య, షేక్ నజీర్, కెవి శేషారెడ్డి, బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని న్యాయ మూర్తులు జె.కాత్యాయని, ఐ.కృష్ణయ్య, ఎస్‌కె సలీంభాషాలు అన్నారు. కోవూరు కోర్టు సముదాయం నుంచి బజారు సెంటర్ వరకు హెల్మెట్ పెట్టండి ప్రాణాలు కాపాడుకోండి అనే అంశంపై మండల లీగల్ సర్వీస్ న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం అవగాహన ర్యాలీ చేశారు. ర్యాలీలో కోవూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పూండ్ల స్టాలిన్ బాబు, కార్యదర్శి వి.రాంబాబు, కోర్ట్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

లగ్జరీ సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి



మంజూరైన రెండు నూతన లగ్జరీ బస్ సర్వీసులకు ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. గురువారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసులు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతన బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డిపో మేనేజర్ ఈ నూతన సర్వీసులను మంజూరు చేసి తనతో ప్రారంభించడంపై ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులు నడపాలన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి బస్టాండులో ప్రయాణికులకు అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డిపో అధికారులకు ఆయన సూచించారు. ఎన్నికల ప్రచారంలో విద్యార్థులు తల్లిదండ్రులు బస్సు సౌకర్యాలు కల్పించాలని కోరారని గుమ్మడి ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంపై ప్రతి గ్రామంలో బస్సు సర్వీసులు తిరిగేందుకు కృషి చేస్తామన్నారు.



ఎటుచూసినా 12013 కిలో మీటర్లు ఉండే ఉదయగిరి నియోజక వర్గానికి ఈ సర్వీసులు అధునాతనంగా స్మార్ట్ ఫోన్లు ఛార్జింగ్ ఉపయోగించుకునేందుకు సీట్లు సౌకర్యంగా ఉండేందుకు ఈ సూపర్ ఏర్పాటు చేశారన్నారు. ముందుగా ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించి శాలవాలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న, రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు షేక్ రియాజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరరావు, యువ నాయకులు పాలగిరి మహేష్ రెడ్డి గాజుల బాబు సందాని, జనసేన నాయకులు నాగేళ్ళ రవి మట్ల రామయ్య లక్ష్మయ్య మైనార్టీ నాయకులు సయ్యద్ సజీల్, మాబాషా, జల్సా యాదవ్, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,JAKKAM SRIHARI (Old name) on my Passport bearing No. T286973, Residing at MIG-2-39, Housing board Colony, Kallurupalli,Nellore,SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as **JAKKAM SRIHARI REDDY** (New name) S/o.JAKKAM MALAKONDAIAH. I further declare that both names are one and the same Person.

CHANGE OF NAME

I,JAKKAM APARNA, My husband name mentioned as SRIHARI JAKKAM (Old name) on my Passport bearing No.B8544649. Residing at MIG-2-39, Housing board Colony, Kallurupalli, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my husband name as **JAKKAM SRIHARI REDDY**(New name) I further declare that my husband both names are one and the same person.

ఆర్డర్ 39 రూల్ 1 & 2 నోటీసు
మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No. 854 / 2020
O.S.No. 15 / 2020

మన్నం వెంకట నరశింహం - పిటిషనర్ / వాది
Vs
అనుమోలు రవీంద్ర - రెస్పాండెంటు / ప్రతివాది

టు,
అనుమోలు రవీంద్ర, తండ్రి **రత్తయ్య,**
పోలినేనిపాలెం గ్రామం, వలేటివారిపాలెం మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరు పిటీషనులోని పరిహారం కోరి నీ మీద పిటీషనరు / వాది దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ, మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు పిటిషను ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **తే19-07-2024 దికి** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ సంజాయిషీ తెలుపుకో వలసినదిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేది యందు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమందు పై పిటీషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా తేది: 19-07-2024

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ టి.గోపాలకృష్ణ మూర్తి
వాది తరపు న్యాయవాది, కందుకూరు

మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 15 / 2020

మన్నం వెంకట నరశింహం - వాది
Vs
అనుమోలు రవీంద్ర - ప్రతివాది

టు,
అనుమోలు రవీంద్ర, తండ్రి **రత్తయ్య,**
పోలినేనిపాలెం గ్రామం, వలేటివారిపాలెం మండలం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరు దావాలోని పరిహారం డిక్రీ కోరి మీ మీద వాది దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ, సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **తే19-07-2024 దికి** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ సంజాయిషీ తెలుపుకో వలసినదిగా నిన్ను ఆదేశించడమైనది. పై తేది యందు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించెదరు.

వాయిదా తేది: 19-07-2024

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ టి.గోపాలకృష్ణ మూర్తి
వాది తరపు న్యాయవాది, కందుకూరు

డాక్యుమెంట్లు పోయినవి

ఏలూరు శైలజ, W/o (లేట్) **వేణుగోపాల్ రెడ్డి** అను నాకు చెందిన కావలి మండలం, ముసునూరు గ్రామ **సర్వే నెం. 787/1** లోని **ప్లాట్ నెం.428** కు చెందిన **552/1987, 4200/2008, 683/2009, 3332/2010** నెంబర్లు గల ఒరిజినల్ రిజిస్టర్డ్ లింక్ డాకుమెంట్లు పోయినవి. దొరికినవారు నాకు చేర్చగలరు.

ఇట్లు
ఏలూరు శైలజ
సెల్ : **9492338960**

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No. 47 / 2022
O.S.No. 233 / 2010

గోరంట్ల శివరామ క్రిష్ణయ్య - D.H.R.
-Vs-
బెల్లంకొండ మాలకొండయ్య
మరియు వగైరాలు - J.D.R

To,
JDR-2, **బెల్లంకొండ శ్రీను,** S/o **మాల కొండయ్య,**
R/o వీర రాఘవునికోట గ్రామం, లింగసముద్రం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

అయ్యా,
పై నెంబరు ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో డి.హెచ్.ఆర్. మీ మీద పిటిషన్ దాఖలు చేసి యుండుటవలన మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు మీకు నోటీసు పంపించిననూ జారీ కానందు వలన శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ఈ ప్రకటన ద్వారా తెలియజేయమని పై పిటిషన్‌ను **తే23-07-2024** దిన వాయిదా వేయబడి ఉన్నది. కావున పై తేది యందు **ఉదయం గం॥ 10-30 నిమిషములకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని తెలుపుకొనవలసినదిగా మిమ్ములను ఆదేశించడమైనది. పైతేది యందు మీరు హాజరు కానియెడల మీపరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా: **23-07-2024**

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ పెన్నా కృష్ణయ్య
శ్రీ నాదెళ్ళ యల్లమందరావు
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్లు
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.